సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 30 । జూన్ । 2025



ఊరి బడికి ఊపిరి

గంగాధరపేట వాసులు బడిని కాపాడుకున్నారు. మూసివేత ముప్పను తప్పించారు. - 8లో



అచ్చెన్నా.. మీకిది తగునా

కణితూరులో శ్మశాన వాటికకు విద్యుత్ సరఫరా చేయడం లేదు. స్థానికులు మండిపడుతున్నారు. - 8లో

నేడు పలాసలో ప్రజా ఫిర్యాదుల వేదిక

కాశీబుగ్గ: కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల వేదిక పలాసలో నేడు జరుగుతుందని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షణలో కార్యక్రమం జరుగుతుందని, జిల్లా కేంద్రానికి వెళ్లకుండా పలాస తహసీల్దార్ కేంద్రం వేదికగా ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

పలాస, టెక్కలిలో డివిజన్ స్థాయి రెవెన్యూ సమావేశాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రెవెన్యూ పరిపాలన మరింత సమర్థంగా ఉండేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన రెవెన్యూ అధికారుల సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం పలాసలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం, పలాస డివిజన్ అధికారుల సమావేశాన్ని నిర్వహించనున్నారు. అలాగే జూలై 2 వ తేదీన టెక్కలిలో టెక్కలి డివిజన్ రెవెన్యూ అధికారుల సమావేశం జరగనుంది. ఈ మేరకు వివరాలు తెలియజేస్తూ జిల్లా రెవెన్యూ అధికారి మార్రెడ్డి వెంకటేశ్వరరావు ప్రకటన విడుదల చేశారు. సమీక్ష సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించి, పరిష్కార మార్గాలు సూచించనున్నట్లు తెలిపారు.

మేట తొలగించింది.. గండం గడిచింది



సముద్రం-ఉప్పుటేరు మధ్య పొక్లెయినర్‌తో ఇసుక మేటలు తొలగిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు డొంకూరు మత్స్యకార గ్రామంలోని బంగాళాఖాతంలో ఏర్పడిన ఆటుపోట్లకు సముద్రం-ఉప్పుటేరు మధ్య ఇసుక మేట వేయడంతో పంట పొలాల్లో ఉప్పునీరు పూర్తిగా నిండిపోయింది. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుండటంతో రైతులు నారు మడులు వేసేందుకు భయాందోళన చెందారు. అధికారులు స్పందించకపోవడంతో పంచాయతీ నిధులతో ఆదివారం పంచాయతీ పాలక వర్గం పొక్లెయినర్లతో ఇసుక మేటలు(పొగురు తీత) తొలగించి ఉప్పుటేరు నీటిని సముద్రంలోకి మళ్లించారు. దీంతో అటు అన్నదాతలు, ఇటు మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, సర్పంచ్ బుడ్డ కళ్యాణ్, చీకటి కృష్ణ, బాలరాజు, శివంగి మోహనరావు, బైపల్లి మోహనరావులతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

బాహుదాకు గర్భశోకం



బాహుదా నదిలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు

ఇచ్ఛాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇచ్ఛాపురంలో ఇసుక రీచ్‌లను ప్రభుత్వం మంజూరు చేయనప్పటికీ స్థానిక నేతల సాయంతో బాహుదా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుకాసురులు దర్జాగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ విధంగా తవ్వకాలు చేపట్టడంతో బాహుదానది ఇప్పటికే ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. నదికి వరదలు వచ్చేటప్పుడు నది ఉప్పొంగే సమయంలో మట్టిదిబ్బలు, వరదగట్లు రక్షణగా ఉంటున్నాయి. ప్రస్తుతం ఇసుకాసురుల కన్ను బాహుదానదిలో గల మట్టిదిబ్బలు, వరద గట్లపై పడింది. దీంతో ఆ మట్టిదిబ్బలు, వరదగట్టులను సైతం తవ్వేస్తున్నారు. పట్టపగలే ఈ తంతు జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. ఇది ఇలాగే కొనసాగితే వరదల సమయంలో ఊరిలోకి నీరు వచ్చేస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేటలో మాటల తూటా

- మెండ దాసునాయుడిపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుమార్తె అర్చన తీవ్ర వ్యాఖ్యలు
- 'యూజ్‌లెస్ ఫెలో' అనడంతో పార్టీలో దుమారం
- హీటెక్కిన టీడీపీ అంతర్గత రాజకీయం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

'యూజ్‌లెస్ ఫెలో'.. టీడీపీ వర్గాల్లో రెండురోజులుగా నలుగుతున్న మాట ఇది. జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు, కింజరాపు సోదరుల ముద్దుల మేనల్లుడు మెండ దాసునాయుడుపై సాక్షాత్తు అతని బావ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సమక్షంలోనే నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుమార్తె అర్చన ఈ పదం వాడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా 'గెట్ అవుట్' అని కూడా అన్నారు. అసలు అర్చనకు దాసునాయుడుపై ఇంత అసహనానికి కారణమేంటి?, అనుకోకుండా అక్కడ జరిగిన ఇష్యూ వల్లనే దాసునాయుడును అనాల్సి వచ్చిందా..? లేక మరేదైనా కారణం మనసులో పెట్టుకుని అందరిముందూ అవకాశం చూసుకుని కావాలనే 'గెట్‌అవుట్' అన్నారా..? అని ఇలా అనేక రకాలుగా పార్టీలో చర్చ జరుగుతోంది.



మెండ దాసునాయుడు

తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు దురుసుగా వ్యవహరిస్తున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మామ అనో, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు బావనో గానీ దూకుడుగా వెళ్తున్నారు. అంతా తానే అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. జిల్లా కేంద్రంలో అనేక వ్యవహారాలు నడుపుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను, ఇతర నాయకులను ఓవర్‌టేక్ చేసి చక్రం తిప్పుతున్నారు. కానీ నరసన్నపేటలో ఆయన ఆధిపత్యం సాగలేదు. దిమ్మతిరిగే విధంగా, అవాక్కయ్యేలా అవమానం ఎదుర్కొన్నారు. ప్రతి విషయంలోనూ ఆయన జోక్యం చేసుకుంటుండడంతో ఎమ్మెల్యేతో పాటు కుమార్తె ఒప్పుకోవడం లేదని, అందుకే ఇలా అన్నారనే వాదన ఉంది. అర్చన చేసిన వ్యాఖ్యలు టీడీపీలో చిచ్చు రేపాయి.

పేటలో కింజరాపు కోటరీకి దన్ను

నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి అయినప్పటికీ అక్కడ కింజరాపు కుటుంబం ప్రత్యేకంగా కోటరీని నడుపుతోందని రమణమూర్తి వర్గం ఎన్నికల్లో సీటు కేటాయించినప్పటి నుంచే ఆరోపిస్తూ వస్తోంది. సొంత నియోజకవర్గం కావటం, బావ కేంద్రమంత్రిగా, మామ రాష్ట్రమంత్రిగా కొనసాగుతుండటంతో దాసునాయుడు ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా పనులు చేపడుతున్నారని రమణమూర్తి వర్గం నుంచి ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా పోలాకి మండలంలోని అప్పట్లో హరిశ్చంద్రపురం నియోజకవర్గం నుంచి విడిపోయి నరసన్నపేటలో చేరిన 14 పంచాయతీల టీడీపీ కేడర్ ఇప్పటికీ నిమ్మాడ నాయకత్వంపైనే ఆధారపడుతున్నారనేది వాస్తవం. ఆ గ్రామాల్లోనే దాసునాయుడు స్వగ్రామం యాట్లబసివలస కూడా ఒకటి. క్రమేణా ఆయాగ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు నిమ్మాడలో రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు అందుబాటులో లేకపోవటంతో దాసునాయుడుకు టచ్‌లోకి వెళ్లిపోతున్నారు. ఇవన్నీ మనసులో పెట్టుకుని 'గెట్‌అవుట్' అని ఉండవచ్చని కొందరు అంటున్నారు.

వేడెక్కిన టీడీపీ అంతర్గత రాజకీయం

మెండ దాసునాయుడ్ని యూజ్ లెస్ ఫెలో...గెట్ అవుట్ అంటూ ఎమ్మెల్యే కుమార్తె అర్చన చేసిన వ్యాఖ్యలతో టీడీపీలో అంతర్గత రాజకీయం వేడెక్కింది. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి వద్ద చర్చ పెట్టాలని, ఏదో ఒకటి నిర్ణయం తీసుకోవాలని మెండ దాసునాయుడు వర్గం డిమాండ్ చేస్తోంది. సోషల్ మీడియాలో కూడా పోస్టులు పెడుతోంది. అంతేకాకుండా వచ్చే ఎన్నికల్లో నరసన్నపేట నుంచి మెండ దాసునాయుడే పోటీ చేస్తారని అప్పుడు చూసుకుంటామని తామేంటో చూపిస్తామని బీరాలు కూడా పలుకుతున్నారు. మరోవైపు జరుగుతున్న పరిణామాలపై బగ్గు రమణమూర్తి వర్గం కూడా నిశితంగా పరిశీలిస్తోంది. తదుపరి ఎలా ముందుకు వెళ్లాలన్నదానిపై సమాలోచనలు చేస్తోంది.



కించపరిచినందుకేనా..?

అధికారంలోకి వచ్చిన తర్వాత మేనమామల అండతో దాసునాయుడు ఆధిపత్యం మరింత ఎక్కువైంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ఫొటో లేకుండా నరసన్నపేట నియోజకవర్గం మొత్తం దాసునాయుడు జన్మదిన బ్యానర్లు, వాల్‌పోస్టర్లతో అనుచరులు హడావుడి చేశారు. సోషల్‌మీడియాలో సైతం పేటలో కాబోయే ఎమ్మెల్యే దాసునాయుడే అంటూ రమణమూర్తిని కించపరిచేలా వ్యవహరించటం వెనుక దాసునాయుడు పాత్ర ఉందనేది అర్చన అనుమానం కావచ్చు. పట్టణంలో ఇటీవల ఒక హోటల్ ప్రారంభానికి ఎమ్మెల్యే లేకుండా దాసునాయుడు నేరుగా ప్రారంభానికి విచ్చేశారని, దీంతో బగ్గు వర్గానికి మరింత మండినట్లు అయిందని చెబుతున్నారు. ఇవే కాకుండా వైన్స్ సిండికేట్ దగ్గర కూడా అక్కడక్కడా దాసునాయుడు వర్గంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు వినికిడి. ఒక సమావేశంలో ఎమ్మెల్యేను నెట్టేసినట్టు సైతం వార్తలు వినిపిస్తున్నాయి.

బగ్గు రమణమూర్తి కుమార్తె అర్చన చేసిన వ్యాఖ్యలు రచ్చ రచ్చ అవుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు యువత అధ్యక్షుడిని పట్టుకుని అంత పెద్ద మాట అనేస్తారా అని పోస్టులు పెట్టుకుని బాధపడుతున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోనే కాదు జిల్లా వ్యాప్తంగా యూజ్ లెస్ ఫెలో.. గెట్ అవుట్ వ్యాఖ్యలపై చర్చ నడుస్తోంది.



• కూర్మరూపధారివై..

రథయాత్ర ముగిసింది. బలభద్రుడు, సుభద్రలతో జగన్నాథుడు రోజుకో అవతారంలో దర్శనమిస్తున్నాడు. శ్రీకాకుళం మొండేటి వీధిలో ఆదివారం కూర్మావతారంలో కనిపించాడు. - శ్రీకాకుళం కల్చరల్

వైఎస్సార్ సీపీ సమావేశానికి ముమ్మర సన్నాహాలు

నరసన్నపేట: జిల్లా కేంద్రంలోని అరసవల్లి రోడ్డులో ఉన్న సన్‌రైజ్ హోటల్‌లో జూలై 3న సాయంత్రం 3 గంటలకు వైఎస్సార్ సీపీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఇందులో శాసన మండలిలో ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు, పార్టీ జిల్లా పరిశీలకులు కుంభా రవిబాబు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.



ధర్మాన కృష్ణదాస్

పెద్దొరిసి కేరాఫ్ వెంకటాపురం



వెంకటాపురంలో పెంచుతున్న జాతి కోళ్లకు దాణా వేస్తున్న పెంపకందారుడు త్రినాథరావు

కొత్తూరు: పెద్దొరిసి.. ఇదో రకం జాతికోడి. పందేలకు వినియోగించే అరుదైన రకాల్లో ఇదీ ఒకటి. కొత్తూరు మండలం వెంకటాపురం ఇప్పుడు ఈ తరహా కోళ్లకు కేరాఫ్‌గా మారింది. గ్రామానికి చెందిన గండికోట త్రినాథరావు సుమారు 100 జాతికోళ్లను పెంచుతున్నారు. వీటిని పెంచడం ఆషామాషీ కాదు. పశువైద్యుల పర్యవేక్షణలో ఈ కోళ్లను త్రినాథరావు పెంచుతున్నారు. పగలంతా తోటల్లో ఉంచుతూ సాయంత్రానికి షెడ్ వద్ద కు చేరుస్తారు. నాటుకోళ్లలో అరుదైన ఈ రకానికి మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. రుచి అమోఘం కావడంతో గోదావరి జిల్లాలకు చెందిన వారు



అడ్రస్ కనుక్కుని మరీ ఇక్కడకు వచ్చి కోళ్లను కొంటుంటారు. కోడి బరువు, సైజ్‌ను బట్టి రెండు వేలు నుంచి రూ. 20 వేలు వరకు కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భాల్లో గోదావరి జిల్లాలతో పాటు పాలకొండ మండలంతో పాటు ఒడిశా నుంచి వస్తుంటారు. గుడ్లను ఇక్కడే పొదిగిస్తుంటామని, ఇతర ప్రాంతాలను నుంచి పిల్లలకు తీసుకురావడం లేదని పెంపకందారు చెబుతున్నారు. ఈ కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.

ఎదురుచూపులు ఎన్నాళ్లో..?

- మార్పులే గానీ చేర్పులు లేని పింఛన్ జాబితాలు
- పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో కొత్త పింఛన్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. కూటమి పాలనలో నెలనెలా కలిపి దాదాపు 12వేల మంది పింఛన్లను తొలగించేసిన ప్రభుత్వం కొత్తవారికి మాత్రం పింఛన్ల జాబితాలో చోటు కల్పించడం లేదు. 2024 ఏప్రిల్‌లో జిల్లాలో పింఛన్‌దారుల సంఖ్య 3,20,886 ఉండగా ఈ ఏడాది మే నాటికి ఆ సంఖ్య 3,08,674కు పడిపోయింది. దాదాపు 12,212 పింఛన్లు తగ్గాయి. చనిపోయిన వారి సంఖ్య పక్కన పెట్టేసినా.. అనర్హుల పేరుతో రాజకీయ కారణాలతో తీసేసిన వారి సంఖ్యే ఎక్కువ.


కొత్త పింఛన్ల మాట అటుంచితే ఉన్న పింఛన్లను కూడా ప్రతి నెలా తీసేస్తున్నారు. ప్రధానంగా దివ్యాంగులు తమ దివ్యాంగత్వం నిరూపించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. సదరం పత్రం ఉన్నా మరోసారి వెరిఫికేషన్ చేసుకోవాలని, లేకుంటే పింఛన్ నిలిపివేస్తామని నోటీసులు ఇచ్చి తొలగించడానికి కూడా వెనుకాడడం లేదు. ఇక చాలా గ్రామాల్లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కక్షపూరితంగా పింఛన్లను ఆపే క్రమం నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటేశారనే నెపంతో పింఛన్లు ఆపేశారు.



జిల్లాలో దాదాపు ఇరవై వేల మంది పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. వారంతా వయోవృద్ధులు, సదరం దివ్యాంగ పత్రాలు కలిగిన వారు, ఒంటరి మహిళలు, అనారోగ్య బాధితులు. కానీ వీరికి పింఛన్లు మంజూరు చేసే అవకాశాలు కనిపించడం లేదు. వారి గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలీక అవస్థలు పడుతున్నారు. రెండు నెలల కిందట భర్త పింఛనుదారుడై ఉండి మరణిస్తే వారి భార్యకు వితంతు పింఛన్ ఇస్తామని చెప్పారు. ఇలాంటి వారు జిల్లాలో 4623 మంది ఉన్నారని లెక్కలు వేశారు. కానీ వారికి పింఛన్ మొత్తం అందడం లేదు. ఇక యాభై ఏళ్లకే పింఛన్ హామీని పాలకులు పూర్తిగా మర్చిపోయారు.

క్లస్టర్ ఉపాధ్యాయులకు కష్టాలు

- ఏ పాఠశాలలో ఏ సబ్జెక్టు బోధించాలో తెలీని పరిస్థితి
- క్లస్టర్ పరిధిలో ఏ పాఠశాలకు వెళ్లాలో తెలీని వైనం
- బయోమెట్రిక్ సమయానికి వెళ్లలేమోనని ఆందోళన



శ్రీకాకుళం: జిల్లాలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన క్లస్టర్ ఉపాధ్యాయ పోస్టుల్లో ఉన్న వారికి అనుకోని కష్టాలు ఎదురవుతున్నాయి. క్లస్టర్ పోస్టులను ఏర్పాటు చేసినప్పటికీ విధి విధానాలు ఇప్పటివరకు ప్రకటించలేదు. ఉపాధ్యాయుల బదిలీలకు ముందు క్లస్టర్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామని, అందులో నియమితులైన వారు క్లస్టర్ పరిధిలో ఎవరైనా సెలవు పెడితే, ఆయా పాఠశాలలకు వెళ్లాలని సూచించారు. క్లస్టర్ పరిధిలో 10 నుంచి 15 పాఠశాలలు ఉంటాయి. ఈ పాఠశాలల్లో ఎవరైనా సెలవు పెడితే, ఆ పాఠశాలకు క్లస్టర్ ఉపాధ్యాయుడు వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్లస్టర్ పోస్టుల్లో నియమితులైన వారంతా డీఈఓ పూల్‌లో ఉన్న తెలుగు స్కూల్ అసిస్టెంట్లు కావడం గమనార్హం. వీరు తెలుగు ఉపాధ్యాయులైనప్పటికీ, తెలుగు బోధించే పరిస్థితి ఉండదు. క్లస్టర్ పరిధిలోని ఏ పాఠశాలలోనైనా ఎవరైనా సెలవు పెడితే వీరు బోధించాల్సి ఉంటుంది. దీంతో వీరు మనోవేదనకు గురవుతున్నారు.

అలాగే ఇటీవల విద్యాశాఖ రాష్ట్ర అధికారులు ఓ ఉత్తర్వు విడుదల చేస్తూ, ప్రార్థన సమయానికి ఏ ఉపాధ్యాయుడైనా బయోమెట్రిక్ వేయకపోతే, వారిని గైర్హాజరు కింద పరిగణించి, ఆ రోజు జీతం కూడా చెల్లించకూడదని పేర్కొన్నారు. దీంతో ఎప్పుడు ఏ పాఠశాలకు వెళ్లాలో తెలీని క్లస్టర్ ఉపాధ్యాయులు మరింత వేదనకు గురవుతున్నారు. సమాచారం లోపం ఉంటే సమయానికి బడికి వెళ్లడం కుదరని పని.

అలాగే క్లస్టర్ ఉపాధ్యాయుడి బయోమెట్రిక్ కూడా క్లిష్టతరంగా ఉంటోంది. ఆన్‌లైన్‌లో స్పెషల్ డ్యూటీ అప్లై చేసుకుని, వెళ్లబోతున్న పాఠశాల లొకేషన్ నమోదు చేసి, హాజరు వేయాల్సి ఉంటుంది. ఇలా ఎన్నో రకాలుగా క్లస్టర్ ఉపాధ్యాయులకు గండాలు ఎదురవుతున్నాయి.

ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు జరగక ముందు, డీఈఓ పూల్‌లో 200 మందికి పైగా భాషా పండితులు ఉండేవారు. వీరిలో 100 మందిని క్లస్టర్ పోస్టుల్లో నియమించగా 45 మంది హిందీ, 18 మంది ఒడియా, 60మంది వరకు తెలుగు భాషా ఉపాధ్యాయులు ఇంకా డీఈఓ పూల్ ఉన్నారు. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా 160 ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో భాషోపాధ్యాయులను నియమిస్తే, క్లస్టర్ పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉన్నా డీఈఓ పూల్‌లో ఉంచాల్సిన పని ఉండదు. ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతులు ఉన్నప్పటికి, తెలుగు పోస్టునే ఇవ్వలేదు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సర్ ప్లస్ ఉపాధ్యాయులు ఉన్నప్పటికి, డీఎస్సీని ప్రకటించి, క్షేత్ర స్థాయిలో ఖాళీలను చూపించేందుకు ఫీట్లు చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ గందరగోళ పరిస్థితిని తప్పించాలని గురువులు కోరుతున్నారు.

గోడు వినేవారు కరువు



భాషోపాధ్యాయుల సమస్యలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. రాష్ట్ర అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెబుతున్నా మా సమస్యలు పరిష్కరించకుండా మరింత జటిలం చేస్తున్నారు. క్లస్టర్ పోస్టుల్లో పనిచేస్తున్న వారి కష్టాలు వర్ణనాతీతం.

- పిసిని వసంతరావు, చైర్మన్ భాషోపాధ్యాయ సంస్థ, శ్రీకాకుళం

క్లుప్తంగా

9న తలనీలాల వేలం

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 9న ఉదయం పది గంటలకు తలనీలాల వేలం నిర్వహించనున్నట్లు ఈవో టి.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జూలై 7 నుంచి 2025 జూలై 8వ తేదీ వరకు భక్తులు సమర్పించిన తలనీలాలకు సంబంధించి వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు ఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

టీఎస్ పీజీఈసెట్‌లో టాపర్‌గా తనూజ



శ్రీకాకుళం న్యూకాలనీ: తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన పీజీఈసెట్ ఫలితాల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇప్పిలి తనూజ ప్రభంజనం సృష్టించింది. తాజాగా వెలువడిన టీఎస్ పీజీఈసెట్ ఫలితాల్లో బయోటెక్నాలజీ విభాగంలో స్టేట్ టాపర్‌గా నిలిచింది. తమ కుమార్తె తెలంగాణలో మొదటి ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

శేఖరాపురంలో చైన్‌స్నాచింగ్



బాధితురాలితో మాట్లాడుతున్న ఎస్సై రమేష్‌బాబు

మెళియాపుట్టి : గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఓ మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయిన ఘటన మెళియాపుట్టి మండలం శేఖరాపురంలో కలకలం రేపింది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. శేఖరాపురం గ్రామానికి చెందిన నక్క శకుంతల గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి వెంబడించారు. చుట్టుపక్కల ఎవరూ లేరని గుర్తించి ఆమెకు దగ్గరగా వెళ్లి ఆగడంతో బాధితురాలు భయపడి పంటపొలాల్లోకి పరుగులు తీసింది. వెంటనే బండి దిగిన ఓ దుండగుడు పుస్తెల తాడు తెంపే ప్రయత్నం చేయగా ఆమె గట్టిగా పట్టుకుంది. అయినప్పటికీ సగం పుస్తెల తాడు తెంచుకుపోయి బైక్‌పై పరారయ్యారు. బాధితురాలు కేకలు విని రైతులు వచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై రమేష్ బాబు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో పొలం పనులు చేస్తున్న ఓ మహిళ మెడలోని పుస్తెలతాడు తెంచుకుపోవడం గమనార్హం.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఉదయపురం గ్రామానికి చెందిన రాయల తిరుపతిరావు(42) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆదివారం మృతి చెందాడు. మద్యం తాగిన వ్యక్తి మైకంలో పురుగులు మందు తాగినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాశీబుగ్గ పోలీసులు ఘటనపపై ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కాశీబుగ్గ సీఐ సూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

నరసన్నపేట: తామరాపల్లి సమీపంలోని తోటలో ఆదివారం నిర్వహించిన పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 12 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.71,040 నగదు స్వాధీనం చేసుకున్నారు. 8 ఫోన్లు, 5 మోటారు సైకిళ్లు సీజ్ చేశారు. నరసన్నపేట పోలీసులకు అప్పగించగా ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



మృతదేహం

హిరమండలం: సొలిపి గ్రామానికి చెందిన పాలక దండాసి (55) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఆయన మృతదేహం గ్రామానికి సమీపంలో కనిపించింది. ఆయన గత కొంతకాలంగా గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్నాడు. మద్యానికి బానిసగా మారిపోవడంతో ఏమీ చేయలేకపోయేవాడు. స్థానికులతో పాటు ఇరుగు పొరుగు గ్రామాల వారు పెట్టే ఆహారాన్ని తింటూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో గ్రామ సమీపంలో చనిపోయాడు. ఆదివారం కుళ్లిపోయిన దశలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. మృతునికి ఇద్దరు అక్కచెల్లెళ్లు ఉన్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహ్మద్ యాసిన్ తెలిపారు.

ఊరి బడికి ఊపిరి



పిల్లల్ని చేర్పించాలని గ్రామస్తులకు చైతన్యం కల్పిస్తున్న గంగాధరపేట పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు

- గంగాధరపేట పాఠశాలకు మూసివేత ముప్పు
- బడిని కాపాడుకునేందుకు రంగంలోకి దిగిన గ్రామస్తులు
- ప్రైవేటు స్కూళ్లలో పిల్లలను మాన్పించి పాఠశాలలో చేర్పిస్తున్న వైనం
- సొంత ఖర్చులతో మౌలిక సదుపాయాల ఏర్పాటు

స్ఫూర్తి

టెక్కలి: నూతన విద్యా విధానంలో భాగంగా విలీనం పేరిట జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం మూసివేస్తోంది. పిల్లలు తక్కువగా ఉన్నారని, ఇతర కారణాలు చూపుతూ గ్రామాలకు సర్కారు బడులను దూరం చేస్తోంది. ఊరి బడితో ఎంతో అనుబంధం కలిగిన ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వ వైఖరి పట్ల మండిపడుతున్నారు. ఎలాగైనా తమ పాఠశాల మూతపడకుండా ఉండేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే టెక్కలి మండలం గంగాధరపేటలో గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చి పిల్లలను బడిలో చేర్పించడంతో పాటు మౌలిక వసతులు కల్పించి అదనంగా వలంటీర్‌ను సైతం నియమించి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

సొంత ఖర్చులతో నిర్వహణ...

గంగాధరపేట ప్రాథమిక పాఠశాలలో గతంలో 13 మంది వరకు విద్యార్థులు ఉండేవారు. గత రెండేళ్లుగా విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతూ వస్తోంది. ఈ ఏడాది పూర్తిగా ఒకే ఒక్క విద్యార్థికి పరిమితమైంది. దీంతో పాఠశాల కొనసాగింపు విషయంలో గ్రామస్తుల్లో ఆందోళన మొదలైంది. పిల్లలు లేకపోతే పాఠశాల ఎత్తివేస్తారని తెలిసి ఎలాగైనా పాఠశాలలో విద్యార్థులను చేర్పించి బడిని బతికించాలనే నిర్ణయానికి వచ్చారు. అప్పటికే గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్ని తిరిగి గ్రామ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 19కు చేరింది. ఇప్పటికే ఒక టీచర్ ఉన్నప్పటికీ అదనంగా సొంత ఖర్చుతో విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమైన మినరల్ వాటర్, ఇతర గ్రామాల నుంచి వస్తున్న విద్యార్థులను సురక్షితంగా ఇళ్లకు తీసుకువెళ్లడానికి సొంతంగా ఆటో ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగులు పిల్లల కోసం భోజనం ప్లేట్లు, మరికొంత మంది గ్రామస్తులు బెంచీలను వితరణగా అందజేశారు. పాఠశాలకు రంగులు వేయించడమే కాకుండా పాఠశాలకు ఆనుకుని విద్యార్థుల ఆట వస్తువుల కోసం చిన్న పాటి మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు.



మినరల్ వాటర్‌ను తాగుతున్న విద్యార్థులు



గ్రామస్తులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన విద్యా వలంటీర్



ఆటోలో ఉచితంగా విద్యార్థులను తీసుకెళ్తూ..



కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు భవానీ

పాఠశాలను వదులుకోం...



గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా ప్రాథమిక పాఠశాల ఉంది. అయితే ఇటీవల విద్యార్థుల సంఖ్య పూర్తిగా పడిపోయింది. దీంతో పాఠశాల మూసివేస్తారనే భయం మా గ్రామంలో ఏర్పడింది. ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలను వదులుకోకూడదనే సంకల్పంతో అన్ని వర్గాల ప్రజలతో పాటు యువకుల సాయంతో స్వచ్ఛందంగా అభివృద్ధి చేస్తున్నాం.

– సంపతిరావు ధర్మారావు, గ్రామపెద్ద, గంగాధరపేట

ప్రైవేట్ స్కూల్ మాన్పించేశా..



గ్రామ పెద్దలు, యువకులంతా మాలో చైతన్యం కల్పించారు. ఎలాగైనా మా గ్రామంలో పాఠశాలను బతికించుకోవాలనే ఆలోచనతో టెక్కలిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు పిల్లల్ని మా గ్రామంలో ప్రభుత్వ బడిలో చేర్పించాను. నాతో పాటు ఎంతో మంది ఇలాగే వారి పిల్లల్ని మా ఊరి బడిలో చేర్పించారు.

– బి.శ్రీనివాసరావు, విద్యార్థుల తండ్రి, గంగాధరపేట

అందరి సహకారంతో..



పాఠశాల అభివృద్ధి విషయంలో గ్రామస్తుల సహకారం మరువలేనిది. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు చైతన్యవంతమై ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న వారి పిల్లల్ని ప్రభుత్వ బడిలో చేర్పించారు. బడిని బతికించుకోవడానికి మేము చేస్తున్న కార్యక్రమాలకు ఉపాధ్యాయురాలు ఎంతగానో సహకరిస్తున్నారు. గ్రామస్తులతో పాటు యువకులు, ఆర్మీ ఉద్యోగులు, మిగిలిన వారు వారి తోచినవిధంగా సాయం చేస్తున్నారు.

– బమ్మిడి లక్ష్మీపతి, గంగాధరపేట, టెక్కలి మండలం

గ్రామస్తుల కృషి అభినందనీయం..



గంగాధరపేటలో ప్రాథమిక పాఠశాలకు ఇటీవల బదిలీపై వచ్చాను. నేను వచ్చినప్పటికే విద్యార్థుల సంఖ్య పూర్తిగా శూన్యంగా ఉండేది. ఈ నేపథ్యంలో విద్యార్థులను చేర్పించడమే కాకుండా మౌలిక సదుపాయాలు కల్పించడానికి గ్రామస్తులు పడుతున్న ఆరాటం చూస్తే ఎంతో ఆనందంగా ఉంది. ప్రతి గ్రామంలోనూ ఇలాగే చేస్తే ప్రభుత్వ పాఠశాలలు ఎంతో బాగుపడతాయి. ఇక్కడి గ్రామస్తుల కృషి ఆదర్శనీయం.

– బి.భవానీ, ఉపాధ్యాయురాలు, గంగాధరపేట

శ్రీముఖలింగంలో అధికారికంగా బాలియాత్ర

- ప్రభుత్వానికి నివేదించిన నిర్వాహక కమిటీ ప్రతినిధులు
- కార్తీక పౌర్ణమి తర్వాత నిర్వహించాలని నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న నిర్వాహక కమిటీ ప్రతినిధులు, అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వంశధార నదీ తీరాన కార్తీక పౌర్ణమి తర్వాత బాలి యాత్ర నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం నిర్వాహక కమిటీ ప్రతినిధులు జీవితేశ్వరరావు, హెచ్.వి.దొర, అర్చకులు, భక్తులతో శ్రీముఖలింగంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా బాలి యాత్ర నిర్వహించే ఘాట్‌లను పరిశీలించారు. వాస్తవంగా కార్తీక పౌర్ణమి మరుసటి రోజున వంశధార నదిలో దీపాలు విడిచిపెట్టి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అనుమతులు, బాలియాత్రకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ఎంతో విశిష్టతగల ఈ యాత్రను అధికారికంగా నిర్వహించాలని వారు కోరారు. శ్రీముఖలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు, వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు, వివిధ దేవతా విగ్రహాల దర్శనం అనంతరం సాయంత్రం ఆరు గంటలకు దీపోత్సవం నిర్వహించేందుకు గ్రామ పెద్దలతో చర్చించారు. పార్టీలకు అతీతంగా పుణ్యక్రతువు నిర్వహించాలని నిర్ణయించారు. సుమారు ఐదు వేల సంవత్సరాలు క్రితం కళింగ రాజ్యంలో బాలి అనే దీవికి వెళ్లి దీపాలు విడిచిపెట్టేవారని, దీంతో వారి నౌకా వ్యాపారం విజయవంతంగా జరిగి మంచి లాభాలతో తిరిగి వచ్చేవారని పూర్వీకుల కథనం. బాలి యాత్ర వల్ల పూర్వీకులు ఆత్మకు శాంతి కలుగుతుందని, తోబుట్టువులు ఆయురారోగ్యాలతో జీవితం గడిపేవారని స్థానికులు చెబుతుంటారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు కె.హరి ప్రసాద్, బి.వి.రమణ, బి.యోగీశ్వరరావు, వైద్యులు సంపతిరావు జగదీష్, పైల శ్రీనివాసరావు, పంచాది రవికుమార్, అర్చకులు కొండయ్య, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే ఉద్యమ, సాహిత్య నిర్మాతలు

- పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకావిష్కరణ చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, రచయితలు

శ్రీకాకుళం కల్చరల్ : ఇటు ఉద్యమాలైనా, అటు సాహిత్య ప్రక్రియలైనా సమర్థంగా నిర్వహించగల సత్తా ఉపాధ్యాయులకు ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం ఏపీటీఎఫ్ అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన పుస్తకావిష్కరణ, పుస్తక పరిచయ సభ నిర్వహించారు. కంచరాన భుజంగరావు రచించిన 'గీసి చెరిపే బొమ్మ' పుస్తకాలను ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పుస్తక రూపంలో ప్రచురించారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రభాకరరావు సతీమణి చిగురుపల్లి చంద్రకళ వర్ధంతి సందర్భంగా రచయిత గంట్యాడ గౌరునాయుడు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి తన ఆలోచనలను మెరుగుపరుచుకుంటూ చేసిన రచనకు ఈ పుస్తకం ప్రతీక అని పేర్కొన్నారు. డాక్టర్ సుంకరి గోపాలయ్య పుస్తకాన్ని పరిచయం చేస్తూ కొన్ని కవితలను చదివి వినిపించారు. కవి కంచరాన భుజంగరావు మాట్లాడుతూ తాను సాహిత్యం రాయడానికి గురువులే కారణమని చెప్పారు. అనంతరం దివికుమార్ రచించిన 'ఉరి కంబం సాక్షిగా' పుస్తకాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి పరిచయం చేశారు. భగత్‌సింగ్ జీవితాన్ని ఈ పుస్తకం మన ముందు ఆవిష్కరిస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్య మాట్లాడుతూ శబ్దం అర్థం కలిస్తే సాహిత్యం అవుతుందని, ఉపాధ్యాయుడు బోధనలో తాత్వికుడుగా ఎదగాలని, వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి సాహిత్యం అవసరమని చెప్పారు. జనసాహితీ రాష్ట్ర అధ్యక్షుడు, రచయిత దివికుమార్ మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితాన్ని తప్పుగా ప్రచారం చేస్తున్నారని, ఈ పుస్తకంలో పూర్తి సాక్ష్యాలతో జీవితాన్ని, తాత్వికతను పరిచయం చేశానని చెప్పారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి, జనసాహితీ జిల్లా కార్యదర్శి పి.మోహనరావు, చావలి శ్రీనివాస్, సదాశివుని శంకరరావు, సీహెచ్ రామచంద్రరావు, కె.గోవిందరావు, పి.లక్ష్మణరావు, రౌతు గణపతిరావునాయుడు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం మృతదేహంతో బైఠాయింపు

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు
- మానవత్వం చూపని ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్
- రోడ్డుపై ఆందోళనకు దిగిన గ్రామస్తులు



కవిటి అగ్రహారం వద్ద రోడ్డుపై మృతదేహంతో బైఠాయించిన కొండపూరు గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు

నందిగాం/వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొరికాన చైతన్య అనే యువకుడు మృతిచెందిన సంగతి తెలిసిందే. అయితే ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోవడంతో కొండపూరు గ్రామస్తులు ఆదివారం నిరసనకు దిగారు. యువకుడి మృతదేహంతో నందిగాం మండలం కవిటిఅగ్రహారం రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రమాదానికి కారణమైన కవిటి అగ్రహారం ట్రాక్టర్ డ్రైవర్ పిట్ట మహేష్ సాయం కోసం వేడుకుంటున్న క్షతగాత్రున్ని అక్కడే విడిచి పట్టి మానవత్వం లేకుండా వెళ్లిపోయాడని, విషయం తెలుసుకున్న ట్రాక్టర్ యజమాని పిట్ట అర్జున్ ట్రాక్టర్‌ను నీటితో కడిగి ప్రమాద ఆనవాళ్లు లేకుండా దాచారని మండిపడ్డారు. న్యాయం చేస్తానని చెప్పి కనిపించకుండాపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల నిరసన నేపథ్యంలో కవిటి అగ్రహారం వద్ద పూండి –పలాస రోడ్డుపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతి, నందిగాం ఎస్సై షేక్ మహహ్మద్ ఆలీ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే యజమాని అర్జున్ వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవడం, కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు వచ్చి బాధితులతో మాట్లాడి ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు, ఓనర్‌పై కూడా కేసు నమోదు చేస్తామని, మృతుని తమ్ముడు హరీష్‌కు న్యాయం చేస్తామని తెలపడంతో శాంతించారు.

ఉద్యోగులకు పీఆర్‌సీ ఎప్పుడిస్తారు?



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు కొత్త పీఆర్‌సీ ఇచ్చే ఉద్దేశం ఉందో లేదో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని దాసరి క్రాంతి భవన్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేతన సవరణ గడువు ముగిసి రెండేళ్లు పూర్తి కావస్తున్నా 12వ వేతన సవరణ ఊసే లేదన్నారు. అసలు పీఆర్‌సీ చైర్మన్‌ను ఇంతవరకు నియమించకపోవడం తగదన్నారు. పీఆర్‌సీపై ఇప్పటికైనా స్పష్టత ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమంటూ ఒక ప్రక్క ప్రకటనలు చేస్తూ కార్పొరేట్ పాఠశాలలకు తల్లికి వందనం పథకం అమలు చేయడంలో ప్రభుత్వం కుట్ర దాగి ఉందని ఆరోపించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ విద్యార్థులను తరలించకుండా మోడల్ పాఠశాలలు ఏర్పాటు చేయమని ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా వినకుండా విద్యార్థులను సమీప పాఠశాలలకు తరలించి మోడల్ విధానమంటూ ఏకోపాధ్యాయ పాఠశాలలను పెంచిందని దుయ్యబట్టారు. సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పాలక పురుషోత్తం, ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.తమ్మినాయుడు, చింతల రామారావు, కూన శ్రీనివాసరావు, బి.సత్యం, ఎస్.రామచంద్ర, హనుమంతు రామకృష్ణ, జి.తిరుమలరావు, డీపీఎస్ పట్నాయిక్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట కూడలి వద్ద ఆదివారం ఉదయం ఒడిశాకు చెందిన ఊక లారీ బోల్తాపడింది. రాజాం నుంచి చిలకపాలెం వైపు వెళ్తుండగా మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో లారీలో ముగ్గురు ఉన్నప్పటికీ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం రెండు క్రేన్‌ల సహాయంతో లారీని బయటకుతీశారు.




లారీని క్రేన్లతో బయటకు తీస్తున్న దృశ్యం

అచ్చెన్నా..మీకిది తగునా!



రోడ్డు పక్కనే వదిలేసిన విద్యుత్ స్తంభాలు

- కణితూరులో శ్మశానవాటికకు విద్యుత్ సరఫరా చేయని అధికారులు
- రాజకీయ కక్షలో భాగమేనంటున్న సర్పంచ్, గ్రామస్తులు




శ్మశానానికి విద్యుత్ సౌకర్యం కోసం రూపొందించిన పంచాయతీ తీర్మానం ప్రతి



కణితూరులో రాజకీయ ఒత్తిడి రాక ముందు వేసిన విద్యుత్ స్తంభాలు

నందిగాం: మండల పరిధిలోని కణితూరు శ్మశాన వాటికకు విద్యుత్ సరఫరా కోసం పంచాయతీ తీర్మాణం చేసి డబ్బులు చెల్లించినా కనెక్షన్ మంజూరు చేయకుండా విద్యుత్‌శాఖ అధికారులు తాత్సారం చేస్తున్నారని సర్పంచ్ పేరాడ విమల, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఉన్న మంచినీటి కోనేరు పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి శ్మశాన వాటికకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు అంచనాలు తయారు చేయాలని ఆ శాఖ ఏఈని కోరేందుకు ఈ ఏడాది జనవరి 7న పంచాయతీ తీర్మానం చేశారు. ఫిబ్రవరి 27న నందిగాం కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ శాఖ వారు తయారు చేసిన అంచనాల మేరకు స్తంభాలు, లైన్ కోసం ఏప్రిల్ 29న రూ.1,26,273 సంస్థకు చెల్లించారు. అనంతరం విద్యుత్ సిబ్బంది శ్మశాన వాటిక వరకు స్తంభాలు తీసుకువచ్చి రెండింటిని పాతిపెట్టారు. తర్వాత ఏం జరిగిందో గానీ మిగిలిన వాటిని అలాగే వదిలేశారు. నెలలు గడుస్తున్నా మిగతా వాటిని పాతకుండా విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీనికి కారణం రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు విద్యుత్ శాఖ అధికారులపై ఒత్తిడి చేసి పని జరగకుండా అడ్డుకోవడమేనని సర్పంచ్, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని చెప్పే మంత్రి.. ప్రతిపక్ష పార్టీ బలంగా ఉన్న పంచాయతీల్లో అభివృద్ధి జరగకుండా, అధికారులపై ఒత్తిడి చేసి పనులు జరగకుండా అడ్డుకోవడం తగదని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు కూడా గ్రామాల మౌలిక సదుపాయాల కల్పనలో ఒత్తిళ్లకు తలొగ్గకుండా ప్రజలకు సేవలు అందించాలని కోరుతున్నారు.

ఇక్కడా రాజకీయమేనా..



గ్రామ పరిధిలోని శ్మశాన వాటికకు విద్యుత్ సదుపాయం కల్పించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీకి అనుకూలమైన గ్రామమనే కక్షతోనే మంత్రి అచ్చెన్నాయుడు శ్మశానవాటిక వద్ద కూడా రాజకీయం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ పనులు పూర్తి చేయాలి.

– పేరాడ రమేష్, కణితూరు

తీర్థయాత్రకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పలాస: టెక్కలిపట్నం గ్రామానికి చెందిన సరస్వతి మహంతి(48) అనే మహిళ తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వెళ్తూ మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సరస్వతితో పాటు చెల్లెలు మీనా, మరో ఇద్దరు మహిళలు కలిసి కారులో తిరుపతి తీర్థయాత్రకు బయలుదేరారు. ఆదివారం వేకువఝామున నెల్లూరు సమీపంలోని నాయుడుపేట వద్ద కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో సరస్వతి అక్కడికక్కడే మృతిచెందగా చెల్లెలు మీనాకు కాళ్లు విరిగిపోయాయి. మరో ఇద్దరు మహిళలకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని టెక్కలిపట్నం ఆదివారం మధ్యాహ్నం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి భర్త గోవింద మహంతి, కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. గోవింద మహంతి శ్రీకాకుళంలో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటనతో టెక్కలిపట్నంలో విషాదఛాయలు అలముకున్నాయి.